క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: కాటన్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎర్రకొండ, రాజోలు ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ శనివారం తెలిపారు. రాజవోలు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

కంప్యూటర్, టైలరింగ్, మగ్గం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో కంప్యూటర్, మగ్గం, టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు శనివారం తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి కంప్యూటర్ కోర్సు చేరేవారు ఇంటర్ పాసై ఉండాలన్నారు. ఇతర కోర్సుల్లో చేరేవారు పదో తరగతి పాసవ్వాలన్నారు. జూన్ 15 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో మెటీరియల్ అలాగే మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తారన్నారు. శిక్షణ అనంతరం ఉత్తీర్ణత పత్రాలను అందిస్తామని రాంబాబు తెలిపారు. కంప్యూటర్ కోర్సులో చేరేవారు 8125686494, టైలరింగ్ బ్యూటిషన్ కోర్సుల కోసం ఫోన్ 9849847489 నంబర్లలో సంప్రదించాలన్నారు. స్వయంగా సంప్రదించాలి అనుకునే వాళ్ళు లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి రావాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కంబాలచెరువు: స్థానిక కంబాలచెరువు ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి శనివారం మృతి చెందాడు. అతని వయస్సు 50 నుంచి 55 సంవత్సరాలు ఉంటుంది. తెలుపురంగు షర్టు, ఆకుపచ్చ నిక్కరు ధరించి ఉన్నాడు. స్థానికులు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ముగిసిన బాస్కెట్‌బాల్ శిక్షణ



విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ప్రముఖులు

ప్రకాశం నగర్: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దానవాయిపేట మున్సిపల్ హైస్కూలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో ఈ గత నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన బాస్కెట్ బాల్ వేసవి శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ బి. సుధారాణి, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ పెంకె సురేష్, జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి, వైఎస్సార్ సీపీ 6వ డివిజన్ ఇన్‌చార్జ్ బూరిడి త్రిమూర్తులు, 38వ డివిజన్ ఇన్‌చార్జ్ సత్తిబాబులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాస్కెట్ బాల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశాంస పత్రం, జ్ఞాపికాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ బురిడి విజయ భాస్కర్, అసిస్టెంట్ కోచ్ ప్రదీప్, నన్నయ్య స్కూల్ పీడీ ఏవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

ప్రకాశం నగర్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతి ప్రవేశాలకు ఆయా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్టు జిల్లా ముఖ్య క్రీడా శిక్షకులు డీఎంఎం శేషగిరి శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15 నుంచి 20 వరకూ మండల స్థాయిలో, 24న రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయిలో ఎంపికలు జరుగుతాయని చెప్పారు. 4వ తరగతికి ఆగస్టు ఒకటి–2014 నుంచి జూలై 31– 2015 మధ్య జన్మించిన వారు అర్హులని, 5వ తరగతికి ఆగస్టు 1–2013 నుంచి జూలై 31– 2014 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారుస్టడీ సర్టిఫికెట్, ఆధార్, పాస్ పోర్టు సైజ్ ఫొటోలు–2, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో 8639774430 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు అన్యాయం

సీటీఆర్ఐ: రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్షకు పైగా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు పని చేస్తుంటే వారిలో కేవలం 10,117 మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తూ నిర్ణయం తీసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మిగిలిన వారికి అన్యాయం చేస్తున్నారని టీఎన్‌టీయూసీ నాయకులు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో టీఎన్‌టీయూసీ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సబ్బితి ఫణీశ్వరరావు మాట్లాడుతూ ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఉన్న వారికి ఇప్పటివరకూ అపాయింట్ మెంట్ ఇవ్వలేదు, ఐసీడీఎస్, డీఆర్‌డీఏ, రెవెన్యూ, జిల్లా పరిషత్, ఆర్అండ్‌బీ తదితర శాఖల్లో పనిచేస్తున్న మిగిలిన వారికి అన్యాయం చేయడం సమంజసం కాదని తెలిఆపరు. కార్మికులు, ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరాయంగా టీఎన్ టీయూసీ పోరాడుతుందన్నారు.

ఆరోగ్యమస్తు

- అర్బన్ హెల్త్ సెంటర్లలో మెరుగైన వైద్య సేవలు
- సకల సౌకర్యాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం



అర్బన్ హెల్త్ సెంటర్‌లో శిశువును పరీక్షిస్తున్న వైద్యుడు



బృహన్నల పేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సేవలందిస్తున్న వైద్యురాలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వైద్యానికి పెద్దపీట వేస్తోంది. ఏ ఒక్కరూ వైద్యం అందక ఇబ్బందులకు గురికాకూడదనే దృఢ సంకల్పంతో మరిన్ని సౌకర్యాలను కలిప్తోంది. కార్పొరేట్‌కు ఆసుపత్రులకు దీటుగా ప్రజలకు వైద్య సేవలందిస్తోంది. దీనిలో భాగంగా స్థానికంగా ఉన్న ఆసుపత్రులను మరింత అభివృద్ధి చేస్తోంది. రాజమహేంద్రవరం పట్టణంలో అర్బన్ హెల్త్ సెంటర్లను అభివృద్ధి చేసి, మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. అర్బన్ హెల్త్‌సెంటర్‌కు సమీపంలో ఉన్న ప్రతి ఒక్కరూ అక్కడికి వెళ్లి చికిత్స పొందేలా జనరల్ వైద్యులతో పాటు ప్రత్యేక వైద్యులు కూడా అందుబాటులో ఉంటున్నారు. రాజమహేంద్రవరం పరిధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లు సొంత భవనాల్లో పూర్తి ఆధునీకరణతో అన్ని సౌకర్యాలతో నిత్యం వైద్య సేవలందిస్తున్నాయి. ఇక్కడ వాంతులు, విరేచనాలు, జ్వరం, దగ్గు, వైరల్ ఫీవర్లు, బీపీ, సుగర్ వంటి వ్యాధులతో మరిన్నింటికి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. యూహెచ్‌సీలకు వచ్చిన రోగులకు మరింత మెరుగైన, అత్యవసర వైద్య సేవలందించాల్సిన అవసరం ఉంటే వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకుచ్చి వైద్యం అందిస్తున్నారు. 11 యూహెచ్‌సీల ద్వారా నిత్యం సుమారు 600 మంది వరకూ వైద్య చికిత్సలు పొందుతున్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా ప్రభుత్వాసుపత్రి ఉండగా, మెడికల్ కళాశాల రాకతో బోధనాసుపత్రిగా మారి అధునాతన సౌకర్యాలు, సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తోంది. అలాగే స్థానికంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లలో 14 రకాల పరీక్షలతో పాటు, 63 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నారు. పీఎం ఎస్ఎంఏ ద్వారా గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, షుగర్, బీపీ ఉన్నవారికి మందులు ఇస్తున్నారు. ఇది గతంలో రూరల్ మాత్రమే ఉండేది. ఇప్పుడు అర్బన్‌లో కూడా బీపీ, షుగర్ మాత్రలు నెలకు సరిపడా ఇస్తున్నారు. ఈ పథకంలో పిల్లలకు అన్ని రకాల వ్యాక్సిన్స్ వేస్తున్నారు.

రాజమహేంద్రవరంలో అర్బన్ హెల్త్ సెంటర్లు

ఆనంద్‌నగర్, బృహన్నలపేట, సారంగధరమెట్ట, నారాయణపురం, అద్దేపల్లి కాలనీ, వీఎల్.పురం, మెరకవీధి, శంభునగర్, కంబాలపేట, అంబేడ్కర్‌నగర్, ఆవ వాంబే కాలనీ, ఇన్నీసుపేట

త్వరలోనే ప్రసవాలు అందుబాటులోకి ..



అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి. వైద్య సేవలు గతం కంటే మెరుగ్గా ఉన్నాయి. అధునాతన సౌకర్యాలు ఏర్పాటుతో పాటు దాదాపు అన్ని రకాల మందులు యూహెచ్‌సీకి వచ్చిన వారికి ఇస్తున్నాం. త్వరలోనే గర్భిణులకు ప్రసవాలు చేయనున్నాం. దాదాపు దానికి సంబంధించిన పనులు కూడా పూర్తయ్యాయి. సాధారణ డెలివరీలు మొత్తం యూహెచ్‌సీలోనే చేస్తాం. అత్యవసరం అనుకుంటే జిల్లా ఆసుపత్రికి పంపుతాం. నిత్యం 50 నుంచి 60 మంది వరకూ ఓపీ ఉంటోంది.

–డాక్టర్ ఎస్.లలిత, నారాయణపురం యూహెచ్‌సీ

కడుపులో కణితి తొలగించి...



నా పేరు వడికుడి గాయత్రి. నా వయస్సు 20 సంవత్సరాలు, డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. నాకు కడుపులో నొప్పి వచ్చేది. అసలు భరించలేకపోయే దానిని. ఆసుపత్రికి వెళ్లి చూపించుకుంటే కడుపులో కణితి ఉంది ఆపరేషన్ చేయాలన్నారు. లక్ష రూపాయలకు పైనే ఖర్చవుతుందని చెప్పారు. నా తండ్రి రోజు వారీ కూలీ, అయితే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎటువంటి ఖర్చు లేకుండా నాకు ఆపరేషన్ పూర్తి చేశారు. చక్కగా చదువుకుంటున్నాను.

ఆరోగ్యశ్రీ నన్ను బతికించింది



నా పేరు మోహన అంజయ్య, నా వయస్సు 55 సంవత్సరాలు. కొద్ది నెలల క్రితం నాకు గుండెలో ఇబ్బందికరంగా ఉండేంది. ఆర్థికంగా అవస్థ పడేవాడిని. ఆసుపత్రికి వెళ్లడం ఆలస్యం చేశాను. తర్వాత నొప్పి వచ్చి ప్రాణం మీదకు వచ్చింది. వెంటనే నా కుమారులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్య పరీక్ష చేసి రక్తనాళాలు మూడు పూడిపోయాయని చెప్పారు. బైపాస్ సర్జరీ చేయాలని వైద్యులు చెప్పడంతో ఏం చేయాలో తెలియలేదు. అయితే నాకు ఆరోగ్య శ్రీ కార్డు ఉండండంతో ఆ ఆసుపత్రిలోనే ఆరోగ్య ద్వారా ఆపరేషన్ చేసి, మందులను ఇచ్చి పంపారు. ఇప్పుడు చాలా ఆరోగ్యంగా ఉన్నాను. ఆరోగ్యశ్రీ నన్ను కాపాడింది.

ప్రతి డివిజన్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయం

- ఎంపీ భరత్ రామ్
- 37వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం



37వ డివిజన్‌లో పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని 42 డివిజన్లలో వైఎస్సార్ సీపీ కార్యాలయాలు ప్రారంభించి నెలకో డివిజన్‌లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. శనివారం నగరంలోని 37వ డివిజన్‌లో లలితా నగర్ వినాయకుని గుడి వద్ద వైఎస్సార్ సీపీ డివిజన్ కార్యాలయాన్ని ఎంపీ భరత్‌రామ్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ నగరంలో ప్రతి డివిజన్‌లో పార్టీ కార్యాలయాలను ఆయా డివిజన్ల ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. నగరంలో ప్రథమంగా 37వ డివిజన్‌లో గుడిమెట్ల బాలాజీ రెడ్డి ఔదార్యంతో సబ్బారపు సూరిబాబు, సుందర్ సింగ్ ఆధ్వర్యంలో కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నెలా నిర్వహించే రచ్చబండకు గ్రామ సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలన్నారు.

నగరంలో రహదారులు మరింత అభివృద్ధి

- ఎంపీ మార్గాని భరత్ రామ్
- రూ.1.65 కోట్లతో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని అన్ని డివిజన్లలో రహదారులు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు ఎంపీ మార్గాని భరత్‌రామ్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని రూ.1.65కోట్లతో 37, 40, 41, 42 డివిజన్లలో సంబంధించి రెండు కిలోమీటర్ల పొడవైన రహదారుల అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక సుభాష్ నగర్ బీవీఎం స్కూల్ వెనుక ఈ అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాన్ని ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో రహదారులు, డ్రెయినేజీలు, వీధిలైట్లు తదితర సమస్యలు పరిష్కరించేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డిసెంబరు నెలాఖరు నాటికి డివిజన్ల అన్నింటినీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నగరంలో ప్రధాన రహదారులు, ప్రధాన డ్రెనేజీలు, జంక్షన్లు, పార్కులు అన్నింటినీ అభివృద్ధి చేశామని ఈ సంవత్సరాంతానికి నగరంలోని అన్ని డివిజన్లను సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలోనే నెంబర్ వన్ సిటీగా హరిత నగరంగా, టూరిజం సిటీగా ది బెస్ట్ వన్ సిటీగా తీర్చిదిద్దడమే ఇప్పుడు మా ముందున్న లక్ష్యమని ఆ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. సీఎం జగనన్న అందిస్తున్న పూర్తి ప్రోత్సాహం వల్లనే ఇదంతా సాధ్యమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంకిస భవానీ ప్రియ, మార్తి లక్ష్మి, టీకే విశ్వేశ్వర రెడ్డి, నక్కా నాగేష్, ప్రవీణ్ చొదరి, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, పీతా రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు విని.. పరిష్కరిస్తానని హామీ ఇచ్చి..

కొంతమూరులో సాయిరాం కాలనీని సందర్శించిన చందన నాగేశ్వర్



సాయిరాం కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు గ్రామంలోని సాయిరాం కాలనీని శనివారం వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ సందర్శించారు. సాయిరాం కాలనీ వాసులు చందన నాగేశ్వర్‌కు సమస్యలను విన్నవించడంతో నేరుగా వాటిని చూసేందుకు పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు 20 ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్యలను, పరిసర ప్రాంతాల్లో ఉన్న మురుగునీరు డ్రైను సమస్యలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి విజయ రెడ్డి, గ్రామీణ నీటి పారుదల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ అనిల్‌తో మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించేలా చేస్తామని హామీ ఇచ్చారు. చందన మాట్లాడుతూ ఈ కాలనీకి వచ్చి ఇక్కడ ప్రజలకు పడుతున్న ఇబ్బందులను చూసి ఎంతో బాధ పడ్డానన్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చందన హామీ ఇచ్చారు. ఎంఎం అలీ, అత్తిలి భీమ శంకరం, చెరుకూరి సత్యనారాయణ, షేక్ మౌలాలీ, సయ్యద్ అస్లం, సయ్యద్ పింటూ, అనెం శ్రీను, టిలి ప్రసాద్, వీర్లపల్లి యేసు, గాబ్రియేల్, వంక సీతారాం, స్థానిక ప్రజలు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీ సంయుక్త మోర్చా సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ములదత్తు

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ సంయుక్త మోర్చా సమ్మేళనం శనివారం హుకుంపేటలోని గోదావరి రుచులు ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్ మాట్లాడుతూ బీజేపీకి 7 మోర్చాల విభాగాలు ఉన్నాయని అవి పార్టీకి ఎంతో ముఖ్యమని మహిళా మోర్చా, యువమోర్చా, ఓబీసీ మోర్చా, ఎస్సీ మోర్చా, ఎస్టీ మోర్చా, మైనార్టీ మోర్చా మొదలగు విభాగాలు ఉన్నాయన్నారు. రానున్న కాలంలో రూరల్ అసెంబ్లీలో పెద్ద సంఖ్యలో మోర్చాలుల బలోపేతానికి కృషి చేసి, ఎలక్షన్‌లో పార్టీని గెలిపించాలన్నారు. మరో విశిష్ట అతిథి కె.వి.ఉన్నికృష్ణన్, జిల్లా అధ్యక్షులు బొమ్ముల దత్తు, మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వివిధ మోర్చాలను బూత్ స్థాయిలో బలోపేతం చేసి ఎన్నికల్లో సమర శంఖారావం పూరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు, రూరల్ కోకన్వీనర్ యానాపు ఏసు, కందుకూరు మనోజ్ బాబు, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వెంకట లక్ష్మీ సంతోషి, జోనల్ ఇన్‌చార్జి రాష్ట్ర యువమోర్చా ఉపాధ్యక్షుడు ఆదిత్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాలేపు సత్య సాయిరాం, ఎస్‌వీబీఎస్ ఆచారి, పాఠం శెట్టి రాజేష్, నాగార్జున, హతీరం, వెంకట్, ధనాల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా కార్యాలయం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: దేవీచౌక్ సమీపంలోని కోర్లమ్మపేటలో కాంగ్రెస్ పార్టీ తూర్పు గోదావరి జిల్లా కార్యాలయాన్ని శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సోడదాసి మార్టిన్ లూథర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్టిన్ లూథర్ మాట్లాడుతూ 2024 ఎన్నికల నాటికి జిల్లాలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు కార్యాలయాన్ని ప్రారంభించినట్టు తెలిపారు.

మండిపోతున్న ఎండలు

- ప్రతి రోజూ 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- అల్లాడిపోతున్న ప్రజలు



వాహనచోదకుల ఇక్కట్లు





సోడా తాగుతూ దాహం తీర్చుకుంటున్న యువతి, తాటిముంజెలు అమ్ముతున్న వ్యక్తి

సీటీఆర్ఐ: ఎండలు మండిపోతున్నాయి. వేడికి ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా ఉన్నాయి. జూన్ మొదటి వారంలో నైరుతి రుతు పవనాలు వచ్చి వర్షాలు కురుస్తాయి. కానీ ఈ సారి పదో తేదీ వచ్చినా వర్షాలు జాడ కనబడడం లేదు. దీంతో ప్రతి రోజూ 45 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడవంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అధిక ఎండతో పాటు ఉక్కపోత కూడా ఉండడంతో పిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.

రోడ్లన్నీ నిర్మానుష్యం

రోజు రోజుకి పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో నగరంలో అన్ని రహదారులు మధ్యాహ్నం నుంచి నిర్మానుష్యంగా మారుతున్నాయి. రోడ్లుపై జన సంచారం కానపడడంలేదు. చిరువ్యారుస్తులు, తోపుడు బండ్లపై వ్యాపారం సాగించేవారు ఎవ్వరూ కూడా మధ్యాహ్నం నుంచి వ్యాపారాలు సాగిండంలేదు. కంబాలచెరువు, గోకవరం బస్టాండ్, తాడితోట, దేవీచౌక్, మెయిన్‌రోడ్డు వంటి రద్దీ ప్రదేశాలలో మచ్చుకు కూడా మనుషులు తిరగం లేదు.

రాత్రి కూడా కొనసాగుతూ..

మామూలుగా వేసవిలో వేడి తాపం ఉంటుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండ వేడిమిలు ఉన్నా రాత్రి కొంచెం వాతావరణం మారి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. కాని ఈ ఏడాది రాత్రుళ్ల కూడా వేడిగానే ఉంటోంది. రాత్రి 11 గంటలకు కూడా ఉష్ణోగ్రతలలో మార్పులు రాకపోవడంతో ఏసీలు, కూలర్‌లు వాడకం పెరుగుపోతోంది. అధిక ఉక్కపోతతో రాత్రులు కూడా జనాలు అపసోపాలు పడతున్నారు.

చల్లటి పానీయాలు తాగుతూ..

నగరంలో పనుల మీద బయటికి వచ్చిన ప్రజలు ఎండ దెబ్బకు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడ చల్లటి పానీయాలు విక్రయస్తుంటే అక్కడ ఆగి తాగుతున్నారు. స్థానిక సెంట్రల్ జైల్ రోడ్డులోని ఇరువైపుల చెరుకు రసాలు, తాటి ముంజెలు, కూల్ డ్రింక్స్, సోడాలు, లస్సీలు, పుచ్చకాయలు, బొప్పాయి వంటి తినుబండరాలును విక్రయిస్తున్నారు. దీనితో పనులు మీద బయటికి వచ్చిన వారు అక్కడ చల్లటి పానీయాలు, కూల్‌డ్రింక్స్ తాగుతూ సేదతీరుతున్నారు. మరో నాలుగైదు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ముగ్గళ్లలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం



ముగ్గళ్లలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రజల సంక్షేమం కోసం నవరత్నాలు పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శనివారం ముగ్గళ్ళ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి, ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యుదయానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అన్ని పథకాలు ప్రజలకు చేరవేసేందుకే ఈ గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. జగన్ పాలనపై ప్రతి కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా జేజేలు పలుకుతున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, వైస్‌ఎంపీపీ–2 సత్యం మదన్‌బాబు, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ సభ్యులు సాదె చంటిబాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, మన్యం నాని, బొమ్ముల రాంబాబు, కూచిపూడి బాబ్జి, కోటేశ్వరరావు, స్వామి, అధికారులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆటో కార్మికుని కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: తోటి ఆటో కార్మికుడు గుండె పోటుతో మరణించడంతో కార్మికులందరూ మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ మార్గాని భరత్ రామ్ చేతుల మీదుగా రూ.60 వేలను మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక కోటిపల్లి బస్టాండు వద్ద ఉన్న జయ దుర్గా భవానీ మదర్ థెరీసా ఆటో స్టాండ్‌కు చెందిన వెంకటరమణ గుండె పోటుతో మరణించాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా మృతుడి యూనియన్‌లో ఉన్న సభ్యత్వాన్ని మరొకరు పాడుకున్నారు. అలా వచ్చిన సొమ్మును మృతుడు వెంకటరమణ భార్య చేతికి ఎంపీ భరత్ ద్వారా ఆటో కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ నగరంలోని అన్ని ఆటో యూనియన్ ఒక గొడుగు కిందకు వచ్చి రిజిస్టర్డ్ అయితే ఫలితం ఉంటుందన్నారు. ఈఎస్ఐ నెలకు రూ.400 చొప్పున చెల్లిస్తే మీ ఆరోగ్యానికి, మీ కుటుంబానికి భరోసా ఉంటుందన్నారు. అనుకోని దురదృష్టకర సంఘటన జరిగితే రూ.10 లక్షలు బీమా వస్తుందని, అనారోగ్య పరిస్థితుల్లో ఉచిత వైద్యం అందుతుందని వివరించారు. వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర నాయకులు ఎన్వీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాసరి ప్రసాద్, యూనియన్ అధ్యక్షుడు కొర్ని సూర్య, ఉపాధ్యక్షుడు వైవీ కుమార్, కార్యదర్శి పి.వెంకటరమణ, సహ కార్యదర్శి కె.వరప్రసాద్, కోశాధికారి సీహెచ్ సత్యనారాయణ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.